# పరిహారం

క్రాపింగ్ సర్దుకొని, కాలరు సవరించుకుని, లెదర్‌బ్యాగు పదిలంగా చేతబట్టుకుని, కుడికాలు ముందుగా నేలపైన మోపి రిక్షాలోనుంచి క్రిందికి దిగాడు సత్యారావు. రోడ్డుకు సమాంతరంగా పిట్టగోడ. దాని కావల చెట్లతో, పొదరిళ్ళతో, క్రోటన్ మొక్కలతో పచ్చని ఆవరణ. ఆ తోట నడుమ రెండంతస్తుల ముచ్చటైన కట్టడం. గేటు తలుపులు మూయబడే వున్నాయి. పరవాలేదు, తాళం వేయలేదు గనుక తీసుకుని లోపలికి వెళ్ళొచ్చు. గేటు కల్లంతదూరంలో - బహుశా తోటమాలిగావచ్చు - ఓ ముసలాయన కనిపించాడు. ముందుగా ఫోనుచేసి రావడం మంచిదైపోయింది. అతడు గనుక అడ్డు తగిలితే 'అరగంట క్రితం ఫోను చేశానయ్యా! తప్పకుండా రమ్మన్నారు. నాకోసం వేచివుంటానన్నారు తెలుసా?' అంటూ దర్జాగా బదులు చెప్పొచ్చు. ముసలాడు దంగైపోవాలి! కానీ దంగైపోవలసిన అవకాశాన్ని ఆ ముసలాయన చేజేతులా జారవిడుచుకున్నాడు. ఇలాంటి మనుషులు రావడమూ, వెళ్ళడమూ గూడా పరిపాటే లెమ్మన్నట్టుగా, అతడు ఉదాసీనంగా వుండిపోయాడు.

సత్యారావు లోలోపల నొచ్చుకున్నాడు. పైపై చూపులకు మనుషులందరూ ఒకటే అయినా చేసే పనుల్నిబట్టి వాళ్ళల్లో విశిష్టులు కొందరుంటారు. ఆ విషయం మీరాబాయిగారికైతే తెలుసు. ఫోనుచేసి 'పత్రికలకు రాస్తున్నానండి!" అని చెప్పేసరికి ఆమె ఉలిక్కిపడినట్టుగా 'అలాగా! తప్పకుండా రండి. నా కిప్పుడేం పనిలేదు. మీకోసం వెయిట్ చేస్తుంటాను' అంది. అదంతా ఈ తోటమాలి ముసలాడి కెక్కడ తెలుస్తుంది?

సత్యారావు వసారాలో ప్రవేశించాడు. కాలింగ్‌బెల్ నొక్కడమూ, ప్రేముకుర్చీలో కూర్చోడమూ, తన రాకను సూచిస్తూ మెల్లగా సకిలించడమూ - సత్యారావు కేదీ పాలుపోకుండా వున్న సమయంలో డోర్ కర్టెన్ కదిలింది. కళ్ళద్దాల మీరాబాయిగారి ముఖం సందులోనుంచి ఈవలికి కనిపించింది. "వచ్చేశారా! పేరేమిటన్నారు? శ్రీధరరావు గదూ! ఉండండి, ఒక నిమిషం వుండడి-" అంటూ ఆమె ఎలుగెత్తి నౌకరు కుర్రాణ్ణి పిలిచింది. "ఒరేయ్ రామూ! వారిని తీసుకెళ్ళి నా గదిలో కూచోబెట్టు" అంది.

ఒక్కొక్క మెట్టే పై కెక్కుతుంటే సత్యారావు శరీరం ఆనందంతో తేలిక పడిపోసాగింది. వేచివుంటానని మాట మాత్రం చెప్పడమేగాదు, ఆమె అక్షరాలా అలాగే ప్రవర్తించింది. రచయితలపట్ల ఆమెలో యింతటి గౌరవభావం వుండొచ్చునని తాను కలలోనైనా అనుకోలేదు. ఎటొచ్చీ ఒక చిన్న అపశ్రుతి. అరగంట క్రితం చెవిలో పడిన పేరును, ఆమె అప్పటికప్పుడే మరచిపోవడం మట్టుకు భావ్యంగా లేదు. అయితే ఒకటి- తన పేరు సత్యారావైతేనేమి, శ్రీధర రావై తేనేమి? తాను రచయిత గావడమేగదా ముఖ్యం!

సత్యారావుకు మేడపైకి వెళ్ళి గదిలో ప్రవేశించడం వరకు మాత్రమే గుర్తుంది. ఆ తరువాత కొద్ది నిమిషాల వరకూ అతడు అచేతనుడు. అందుకు కారణమేటంటే- అతడి పాలిటి కాగది మ్యూజియంలో ఒక భాగంలా కానరావడమే! వివిధ పరిమాణాలతో, ఆకృతులతో పది పన్నెండు కలాలు, తాబేటి పిల్లలాంటి పేపరు

వెయిటు, కోడి గుడ్డులా అదే సైజులో ఒక గడియారం, అగ్గిపెట్టె పరిమాణంతో ఒక ట్రాన్సిస్టరు, చలువరాతి విగ్రహాలు, కొండపల్లి బొమ్మలు, సంగీతవాయిద్యాల చిన్న చిన్న నమూనాలు............ సత్యారావు చూపులు పొదల్లో చెవులపిల్లుల్లా ఆ గదిలో ఒక చోటునుంచీ యింకొక చోటికి గిరికీలు కొడుతూ వుండిపోయాయి.

ఎలాగైతేనేమి, అయిదు నిమిషాలలా గడిచేసరికి అతడున్నట్టుండి తన స్పృహలోకి తాను వచ్చేశాడు. కొత్తగా పట్నంలో దిగిన పల్లెటూరివాడిలా తానంతటి ఆశ్చర్యానికి లోనై పోవడం అతడికి నామోషీవ్యవహారంగా తోచింది. సోఫాలో సర్దుకుని గంభీరంగా కూచున్నాడు. అలా కూర్చుంటూవున్న సత్యారావుకు మరింత విస్మయాపాదకమైన సన్నివేశం ఒకటి ఆ గదిలో కానవచ్చింది. తన నిందాకా ఆ గదిలోకి తీసుకొచ్చాడే, ఆ కుర్రాడు రామూ యింకా గదిలోనే వున్నాడు. ఉండడమేగాదు, మృణ్మయశిల్పంలా బిర్రబిగుసుకుపోయి టేబిలు కానుకుని నిలబడిపోయాడు. నిల్చోడమే గదా, రెప్పపాటనే మాటలేకుండా తనవైపు గ్రుడ్లప్పగించి చూస్తున్నాడు.

రచయితగా పరిచయం చేయబడినప్పుడు కొందరీవిధంగా తనవైపు చూడడం కద్దు. మునుపటి కొక కవిగారి యింట్లో కట్టుకంబం గూడ కవిత చెప్పేదట! మీరాబాయి గారింట్లో నౌకర్లకుగూడా అంతో యింతో సాహిత్య పరిజ్ఞానం వుండి వుండొచ్చు. లేకుంటే ఈ కుర్రాడిలా అనిమిషలోచనుడై పోవడానికి మరొక కారణమేదీ కనిపించదే!

మళ్ళీ కొద్ది నిమిషాలు గడిచాయి. సత్యారావిప్పుడు కుర్రవాడివైపు చూడ్డం మానేసి, గోడకు వ్రేలాడుతున్న ఫోటోలవైపు చూస్తున్నాడు. మీరాబాయి గారు మునిసిపాలిటీ అధ్యక్షురాలుగా వుండగా కౌన్సిలర్లతో కలిసి తీయించుకున్నవీ, యం.యల్.సి.గా వుండగా ముఖ్యమంత్రితోనూ, ఇతర మంత్రులతోనూ తీయించుకున్నవీ, విద్యా సంస్థల్లో ప్రయిజులిస్తు తీయించుకున్నవీ, విమానం దిగుతూ తీయించుకున్నవి- ఇంకా ఎన్నెన్నో! 'వివిధ పదవుల్లో మీరాబాయి' అని పేరు పెట్టడానికి వీలైన ఆ ఛాయా చిత్రాల గాలరీవైపు చూస్తుండగానే సత్యారావుకు అడుగుల చప్పుడు వినిపించింది.

"ఏమండీ శ్రీధరరావుగారూ! చెప్పండి. ఏమిటీ విశేషం? అన్నట్టు మీ రేపత్రిక నుంచీ వస్తున్నారో చెప్పనేలేదే?" పలకరిస్తూ లోపలికి వచ్చి తన కుర్చీని తాను స్వీకరించింది మీరాబాయిగారు.

"నేనా! పత్రికల సంగతి అడుగుతున్నారా?" కాస్తా తడబడిపోతూ కొనసాగించాడు సత్యారావు. "మరినేనండీ! భారతి, యువ, జ్యోతి, స్వాతి - యింకా వారపత్రికలు.....దాదాపు అన్ని తెనుగు పత్రికలకూ రాస్తుంటాను."

"అబ్బే, అదిగాదండి నేనడగడం? మీ రేపత్రికకు రిపోర్టరుగా పని చేస్తున్నారు- అని?"

"కాదండీ మేడమ్!" లేని తెంపు దెచ్చిపెట్టుకున్నాడు సత్యారావు. "రిపోర్టర్లు వేరు. రచయితలు వేరు. నేను రచయితని. కథలు, నవలలు రాస్తుంటాను."

"అట్లాగా!" ఈసారి తెల్లబోయేవంతు మీరాబాయి గారికే దక్కింది. "పత్రికలకు రాస్తుంటానంటే నేనింకా రిపోర్టరై వుంటారనుకున్నాను. అదిగో చూచారా, అది

'నారీలోకం' పత్రికకు నేనిచ్చిన ఇంటర్వ్యూ ఫోటోనే! తరువాత పత్రికలో గూడా వచ్చింది, రెండు పేజీల వ్యాసంతోబాటుగా!"

రచయిత లంటే అనధికార న్యాయమూర్తులు, నిజమైన ప్రజాప్రతినిధులు. లోకశ్రేయస్సుకోసమే వాళ్ళు రచనలు చేస్తారు. మంచిని పెంచి, మానవత్వానికి మకుటం పెట్టి, మిథ్యావిలువల్ని ఖండిస్తారు - ఇలా రచయితల్ని గురించి చెప్పడానికి ఎన్నో మంచి విషయాలు తెలిసి పెట్టుకున్నవాడే సత్యారావు. కానీ, ఆ క్షణాన తన జీవితంలోని వైఫల్యాలన్నింటిలోనూ తాను న్యూస్‌రిపోర్టరు గాకపోవడం అతనికి ప్రథమగణ్యంగా తోచింది.

"అయితే కథలూ అవీ రాస్తుంటారా? ఏం కథలు రాశారు?"

కిందికి దించిన తట్టలో ఏం కూరగాయలున్నాయని అడిగితే చెప్పడం సులభమే! వ్రాసిన కథల్ని గురించి ఏమని చెప్పడం? ప్రేమకథలు అనాలా? బ్రతుకు బరువు కథలు అనాలా? ఇంకా ఘనంగా వుండాలని 'ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగునపడి కాన్పించని కథలు' అనాలా? లేకుంటే ఒళ్ళు మండి 'ఏవో దిక్కుమాలిన కథలు' అనాలా?

"పోనీలేండి! ఏదో రాసేవుంటారు. మరైతే యిప్పుడు మీరొచ్చిన పని?"

"అదే చెబుతున్నాను. ఈమధ్య నేనొక నవల రాశాను. అచ్చులో వుంది. పదిరోజుల్లో పూర్తిగావచ్చు...."

"మంచిది. ఇంకేం?"

"దాన్ని..........మీకు............."

"నాకు?..............."

"అంకితమివ్వాలనుకుంటున్నాను."

"నాకంకితమిస్తారా? మంచిదే. నాకేమభ్యంతరం లేదు. ఇవ్వండి."

సత్యారావు శరీరంలో కొన్ని నరాలు పుటుకు పుటుక్కున తెగిపోతున్నట్టయింది. 'మీరు రాసిన నవల పేరేమిటి? అందులో విషయమేమిటి? దాన్ని ప్రత్యేకించి నాకే అంకితమివ్వాలనుకోవడంలో మీ ఉద్దేశమేమిటి?'- మీరాబాయిగారి ధోరణి యిలా సాగివుంటే ఎంత బాగుండేది!

ప్రసంగాన్ని ఎలా కొనసాగించాలో తోచక సత్యారావు బిక్కరిస్తుండగా ఫోన్‌మ్రోగింది. ఒకటి రెండు నిమిషాలు మాట్లాడిన తర్వాత "ఇప్పుడే వస్తానుండండి రావుగారూ!" అంటూ మీరాబాయిగారు క్రిందికి వెళ్ళిపోయింది.

ఆమె కడపదాటుకోడమే ఆలస్యం - కుర్రాడు రామూ గదిలోపలికి వచ్చేశాడు. మళ్ళీ అదే టేబిలుప్రక్కన, అదే భంగిమలో, అదేవిధంగా రెప్పపాటు లేకుండా తనవైపేచూస్తూ...........

సత్యారావుకు మతిపోయినంత పనైపోయింది - ఉంటే మీరాబాయిగారైనా వుండాలి. లేదా ఈ కుర్రాడయినా వుండాలి. అలాకాకుండా అతిథుల్ని ఈ గదిలో ఒంటరిగా ఉండనివ్వరన్నమాట. ఎందుకు?

ఈ ప్రశ్న సత్యారావు బుర్రలో అదేపనిగా రొదచేస్తూ వుండిపోయింది. పది పదిహేను నిమిషాల్లో మీరాబాయిగారు మేడపైకి తిరిగొచ్చింది. సత్యారావులో మునుపటి ఉత్సాహం లేదు. సమావేశంలో ఉత్తర రంగం మరింత చప్పగా పరిణమించిందనే చెప్పాలి.

"మీ రంకితమిస్తారు సరే! నేనేం చేయవలసి ఉంటుందో చెప్పారుకాదు?" మళ్ళీ ఉపక్రమించింది మీరాబాయిగారు.

"ఏంలేదు. ఒక ఫంక్షన్ ఏర్పాటుచేస్తే బాగుంటుంది."

"చెయ్యండి. దానికేం? ముందుగా కబురు పెడితే నాకెప్పుడు వీలవుతుందో చెబుతాను. భేషుగ్గా చెయ్యండి. తప్పేముంది?"

వంచుకున్న తలను సత్యారావు పైకెత్తనేలేదు. అలాగే సెలవుతీసుకుని దోషిలా బయటికి వచ్చేశాడు. ఇంతకూ తాను చేసిన నేరమేమిటో అతనికి స్ఫురించనేలేదు.

కాళ్ళీడ్చుకుంటూ ఒక ఫర్లాంగు దూరం నడిచివుంటాడు సత్యారావు. "బాబుగారూ!" అంటూ ఎవరో పిలవడం వినిపించింది. తలపైకెత్తేసరికి రామూ కనిపించాడు. చేతిలోవున్న కార్డులు,కవర్లు లాంటి సరంజామానుబట్టి వాడు పోస్టాఫీసుకు వెళ్ళొస్తున్నాడని గ్రహించడానికి వీలయింది.

"ఏమిటి?" చూపులతోనే ప్రశ్నించాడు సత్యారావు.

"బాబుగారూ! ఓపావలా వుంటే ఇప్పిస్తారా?"

చిల్లర డబ్బులకోసం జేబులో చేయివేస్తుండగా సత్యారావుకొక విషయం జ్ఞప్తికి వచ్చింది. "మరైతే నేనొకమాట అడుగుతాను. చెబుతావా అబ్బీ?" అన్నాడు.

రామూ తలపంకించాడు.

"ఎవరైనా కొత్తవాళ్లొస్తే మీ అమ్మగారక్కడ లేనప్పుడు నువ్వు చక్కా గదిలోపలికి వెళ్ళి నిల్చోవాలిగదూ? ఎందుకని?"

"అవునండీ! అలా చేయకపోతే అమ్మగారు చంపేస్తుంది. గదిలో ఎన్నో విలువైన వస్తువులున్నాయట. అందులో ఏదిపోయినా నాదే జవాబ్దారీ అంటుంది......"

మీరాబాయిగారి యింటినుంచీ తిరిగొస్తూవుండగా సత్యారావుకు తనవల్ల జరిగిన దోషమేమిటో తెలిసొచ్చింది. దోషపరిహార నిమిత్తం తాను త్రొక్కవలసిన మార్గమేమిటో స్ఫురించింది. కొంతదూరం వెళ్ళిన తర్వాత ఆ మార్గం రెండుగా చీలింది. ఒకదారి వెంట వెళ్తే అది నాన్నమ్మ దగ్గరకు తీసుకెళ్తుంది. ఇంకొక దారిగుండా వెళ్తే అది 'రాజీ' దగ్గరకు వెళ్ళి నిలుస్తుంది.

తన పసితనపు ప్రపంచంలో జాబిల్లిలాంటిది నాన్నమ్మ. బడి వదిలి పెట్టి పిల్లలు యిళ్ళు చేరుకునేటప్పటికి, ఆమె తనకోసం వీధిగుమ్మంలో నిలబడి ఉండేది. ఎవరు ఏ తినుబండారం యిచ్చినా దాన్ని తనకోసం అట్టిపెట్టి ఉంచేది. రాత్రుల్లో తనను ప్రక్కన పడుకోబెట్టుకుని ఎన్నో కథలు చెప్పేది. ఎప్పుడైనా తనకు జ్వరమొస్తే అది నయమయ్యేదాకా ఆమెకు నిద్రాహారాలుండేవిగావు. తాను ఏ కలెక్టరో, జడ్జియో కావాలన్నది ఆమె ఆశ. పుట్టినరోజున తానామె కాళ్ళకు మ్రొక్కితే 'నా ఆయుస్సు కూడా నువ్వే పోసుకుని నూరేళ్ళు బ్రతుకు నాయనా!' అని దీవించేది.

'రాజీ'ది మరోచరిత్ర. దానికి మాటలురావు. విశ్వాసం, అభిమానంలాంటి తన భావాలన్నింటినీ అది తన చూపుల ద్వారానే ప్రకటించేది. తన అడుగులో అడుగు వేసుకుంటూ ఎక్కడకి వెళ్ళినా తనను వెన్నంటివుండేది. ఎవరినీ తన జోలికి రానిచ్చేదిగాదు. మూడేళ్ళవయసులో తానొకనాడు పెరట్లో ఆడుకుంటూ వుండగా ఓ నల్లత్రాచు తూములోనుంచి ఆకుకూరల పాదులోకి వచ్చేసింది. అది తనవైపు రాబోతూండటం చూచి 'రాజీ' చేసిన కారుబారు చెప్పతరంగాదు. చుట్టు ప్రక్కల

యిళ్ళవాళ్ళుగూడా అక్కడికి పరుగెత్తుకొచ్చేశారు. 'రాజీ' లేకుంటే ఆ రోజు తన గతేమైవుండేదో?

అన్నట్టు సత్యారావు నవల ఎవరి కంకితమవుతుందో యిప్పుడే ఎలా తెలుస్తుంది? అందుకింకొక పదిరోజులు ఆగి చూడాలి....

♦ 'నందిని' మాసపత్రిక, 1981 ♦